క్లుప్తంగా

నేడు సమస్యల పరిష్కార వేదిక స్పందన

కంచికచర్ల: ప్రజాసమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి జరుగుతుందని తహసీల్దార్ శంకర బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లోని సమస్యలను అర్జీల ద్వారా తెలియజేయవచ్చని ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తారని పేర్కొన్నారు.

నందిగామ: పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందని ఆర్డీఓ రవీంద్రరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

13న ఎంపీపీ ఎన్నిక

వత్సవాయి: ఈ నెల 13న మండల పరిషత్ అధ్యక్ష ఎన్నిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చెన్నారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో అధ్యక్షుడుగా పనిచేసిన చెంబేటి వెంకటేశ్వర్లు గత నెల మరణించారు. ఏపీ ఎన్నికల సంఘం ఆదేశాలతో అధ్యక్షుల ఎన్నికకు మండల పరిషత్ కార్యాలయంలో అత్యవసర సమావేశం నిర్వహించి ఎన్నుకోవాలని సూచించారు. ఉదయం పదకొండు గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని తెలిపారు. సభ్యులు హాజరుకావాలని కోరారు. అనివార్య కారణాలతో ఆ రోజు ఎన్నిక జరగనట్లయితే మరుసటి రోజు మండల ప్రజా పరిషత్ సెలవు దినమైనా, కాకపోయినా ఎన్నిక జరుగుతుందని పేర్కొన్నారు.

త్రిశక్తి పీఠంలో ప్రత్యేక పూజలు



నందిగామ: పల్లగిరి గుట్టపై ఉన్న త్రిశక్తి పీఠంలో ఆదివారం సప్తమి నేపథ్యంలో విశేష పూజలు జరిగాయి. తొలుత ఆలయ అర్చకుడు రాజేష్‌శర్మ ఆలయంలోని కనకదుర్గ, కనకమహాలక్ష్మి, జ్ఞాన సరస్వతికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం సామూహిక కుంకుమ పూజలు జరిగాయి. ఆలయ ప్రాంగణంలో పాలపొంగళ్లు పొంగించి అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు.

వీధిదీపాలకు మరమ్మతులు



జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణంలోని ప్రధాన రోడ్ల డివైడర్లపై ఉన్న బటర్ ఫ్లై లైట్ల మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. కొంత కాలంగా కొన్ని చోట్ల సరిగా వెలగడం లేదు. దీంతో పట్టణంలోని అన్ని ప్రధాన రహదారుల డివైడర్లపై ఉన్న బటర్ ఫ్లై లైట్లను మరమ్మతులు చేయిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ నాగమల్లేశ్వరరావు ఆదివారం తెలిపారు. నెహ్రూచౌక్‌లో ఉన్న వాటర్ ఫౌంటెన్, లైటింగ్‌ను పరిశీలించి స్వల్ప మరమ్మతులు చేయించినట్లు తెలిపారు. నెహ్రూచౌక్ చుట్టూ ఆక్రమణలను తొలగించి మొక్కలు నాటడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కొత్త రైతుబజారు వద్ద ఆక్రమణలను తొలగించాల్సిందిగా సంబంధిత ఆక్రమణదారులకు తెలియజేశామని, రెండు రోజుల్లో తీయకపోతే మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగింపునకు చర్యలు తీసుకుంటారన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం పలువురు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం కళావేదికపై శ్రీ దుర్గా భవానీ నృత్య కళాశాలకు చెందిన అక్షిత, రమ్యశ్రీ, నవ్య, తన్విలు పలు కీర్తనలకు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.

ఆలయ కమిటీకి అండగా ఉంటాను

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ప్రాంగణంలోని శ్రీ విఘ్నేశ్వర శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి వార్ల దేవస్థానం కమిటీకి అండగా ఉంటానని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. శ్రీ విఘ్నేశ్వర శ్రీ రమాసహిత సత్యనారాయణ స్వామి దేవస్థానం కమిటీ సర్వసభ్య సమావేశం పాతబస్తీలోని హిందూ హైస్కూల్ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేవస్థానం కమిటీ, విజయవాడ వారికి వంశపారంపర్యంగా న్యాయపరంగా హక్కులు ఉన్నట్లైతే వారికి అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. కమిటీ అధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.

చకచకా అభివృద్ధి

- ప్రభుత్వ విప్ ఉదయభాను
- రేపు 'పేట'లో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని పర్యటన
- పలు అభివృద్ధి పనుల ప్రారంభం



పేట ప్రభుత్వాసుపత్రిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జగ్గయ్యపేటలో అభివృద్ధి పనులు చకచకా జరుగుతున్నాయని ప్రభుత్వ విప్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను చెప్పారు. ఈ నెల 11న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని జగ్గయ్యపేట పట్టణంలో పర్యటించనున్నారని చెప్పారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక ప్రభుత్వాసుపత్రితో పాటు అర్బన్ హెల్త్ సెంటర్లలో ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఉదయభాను మాట్లాడుతూ మంగళవారం వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి జగ్గయ్యపేట పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్నారని తెలిపారు. పట్టణంలో రెండు చోట్ల ఒక్కొక్కటి రూ.90 లక్షల చొప్పున ఏర్పాటుచేసిన అర్బన్ హెల్త్ సెంటర్లను, రూ. 3 కోట్ల వ్యయ అంచనాతో నిర్మించిన ప్రభుత్వాసుపత్రి అదనపు భవనాలను మంత్రి ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కతారి హరిబాబు, సూపరింటెండెంట్ హరీష్ పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో అర్బన్ హెల్త్ సెంటర్ పరిశీలన

స్థానిక బలుసుపాడు రోడ్డులోని జగనన్న కాలనీలో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్‌ను మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. పట్టణంలో తొర్రగుంటపాలెంలో ఒకటి, జగనన్న కాలనీలో ఒక్కో అర్బన్ హెల్త్ సెంటర్లను ఒక్కొక్కటి రూ.90 లక్షల నిధులతో నూతనంగా నిర్మించారని, వాటిని మంత్రి ప్రారంభిస్తారని చైర్మన్ తెలిపారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పెనుగంచిప్రోలు మండల సచివాలయాల కన్వీనర్ కన్నమాల శామ్యూల్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

6.80 కోట్లతో రోడ్ల పనులు

జగ్గయ్యపేట అర్బన్: నియోజకవర్గంలో పలు గ్రామాల ప్రధాన రహదారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ. 6.80 కోట్ల నిధులు మంజూరైనట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ఆదివారం తెలిపారు. జగ్గయ్యపేట మండలానికి సంబంధించి షేర్‌మహ్మద్‌పేట నుంచి గండ్రాయి ప్రధాన రోడ్డుకు రూ 2.50 కోట్లు, పెనుగంచిప్రోలు మండలంలోని అనిగండ్లపాడు నుంచి గుమ్మడిదుర్రు రోడ్డుకు రూ 1.20 కోట్లు, శివాపురం నుంచి అనిగండ్లపాడుకు రూ.కోటి, పెనుగంచిప్రోలు పట్టణం నుంచి వేమవరం రోడ్డుకు రూ. 1.50 కోట్లు, జగ్గయ్యపేట బైపాస్ రోడ్డుకు రూ.60 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. మూడు, నాలుగు నెలల్లో రోడ్ల నిర్మాణం పూర్తవుతుందని ఎమ్మెల్యే ఉదయభాను తెలిపారు.

భక్తిశ్రద్ధలతో సారె సమర్పణ



నందిగామలో దత్తసాయి సేవాసంఘం ఆధ్వర్యాన సారె తీసుకొస్తున్న మహిళలు

నందిగామ: స్థానిక దత్త సాయి సేవా సంఘం ఆధ్వర్యాన పట్టణంలోని పలు ఆలయాల్లో అమ్మవార్లకు ఆదివారం ఆషాఢ సారెను సమర్పించారు. తొలుత పట్టణంలోని అన్ని ప్రధాన వీధుల్లో మేళతాళాలు, కోలాట నృత్యాలు, మంగళ వాయిద్యాల నడుమ సారెను ఘనంగా ఊరేగించారు. అనంతరం రామలింగేశ్వరస్వామి ఆలయం, సీతారామాంజనేయ స్వామి ఆలయం, వాసవి కన్యకా పరమేశ్వరి శ్రీచక్ర మందిరం, నెహ్రూ నగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయం, ముత్యాలమ్మ ఆలయం, మరిడి మహాలక్ష్మి ఆలయాల్లో కొలువైన అమ్మవార్లకు సారె సమర్పించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తిరుపతమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు



క్యూలైన్‌లో అమ్మవారిని దర్శించుకుంటూ..



ఆలయం వద్ద బోనాలతో భక్తులు

పెనుగంచిప్రోలు: గ్రామంలోని శ్రీతిరుపతమ్మ దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆషాఢమాసం, ఆదివారం కావటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రావటంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిశాయి. భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు మధ్యాహ్న సమయంలో మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు.



మక్కపేట నుంచి వచ్చే రోడ్డులో నిలిచిన వాహనాలు

నిలిచిన వాహనాలు

పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మ దర్శనానికి ఆదివారం వేల సంఖ్యలో భక్తులు తరలి రావటంతో పాటు వందల సంఖ్యలో వాహనాలు వచ్చాయి. ఆంధ్ర నుంచే కాక తెలంగాణ నుంచి కూడా వందల సంఖ్యల వాహనాల్లో భక్తులు తరలి వచ్చారు. దీంతో గ్రామంలో ట్రాఫిక్ సమస్యలు ఎదురయ్యాయి. దీనికి పోలీసులు చర్యలు తీసుకున్నారు.

విద్యార్థులు ఆధ్యాత్మిక విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): విద్యార్థులు పాఠశాల విద్య, సాంకేతిక విద్యతో పాటు ఆధ్యాత్మిక విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. హిందూ సేవా సమితి ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సత్యనారాయణపురంలోని శృంగేరి పాదుకా క్షేత్రంలో వినాయక ప్రతకల్పం, వరలక్ష్మి వ్రత కల్పం లక్ష పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు అందించడానికి విద్యార్థి దశ నుంచే ఆధ్యాత్మిక విద్యను అభ్యసించాలన్నారు. వినాయక చవితి పండుగ రోజు అందరికీ ఈ పుస్తకాలు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న చేయూతను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నతమైన భావిభారతపౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణిమూర్తి, హిందూ సేవా సమితి ఎడ్యుకేషన్ సమితి అధ్యక్షుడు రాధాకృష్ణ, బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు బలరామకృష్ణ, చలపతిరావు, ప్రభాకరశాస్త్రి, కుందా శ్రీధర్ పాల్గొన్నారు.



వినాయక, వరలక్ష్మి వ్రతకల్పం పుస్తకాలను ఆవిష్కరించిన ప్లానింగ్‌బోర్డు ఉపాధ్యక్షుడు విష్ణు

టైలర్ల సంక్షేమానికి కట్టుబడిన ప్రభుత్వం

కృష్ణలంక(విజయవాడతూర్పు): టైలర్స్ అభివృద్ధికి, సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ అన్నారు. కృష్ణలంకలోని పొట్టి శ్రీరాములు నగరపాలకసంస్థ పాఠశాల వద్ద న్యూ విజయవాడ టైలర్స్ అండ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కుట్టు మిషన్ సృష్టికర్త ఇలియస్ హోవే 204వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న అవినాష్, అడపా శేషు, బెల్లం దుర్గ హోవే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. టైలర్ షాపు ఉన్న ప్రతి ఒక్కరికీ ఏడాదికి రూ.10వేలు ఇస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. టైలర్స్‌కు అసోసియేషన్ కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు, టైలర్స్‌కు ట్రెనింగ్ కుట్టుశిక్షణా కేంద్రం ఏర్పాటు చేసేందుకు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన కాకర్లపూడి వెంకటేశ్వరరాజు(తేజస్వి రాజు)ను అభినందించారు. కార్యక్రమంలో టైలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు వీనస్ బాబు, కొండేటి వెంకట్రావు, తిరుమాని ఆనందరావు, భాస్కరరావు, గణేష్, అప్రోజ్, మెట్రో బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

వాహనచోదకులు నిబంధనలు పాటించాలి

పెద్దాపురం(వీరులపాడు): వాహనచోదకులు నిబంధనలు పాటించాలని ఎస్ఐ మహాలక్ష్మణుడు పేర్కొన్నారు. పెద్దాపురంలో ఆదివారం ఆయన వాహనాల తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా వాహనచోదకులు లైసెన్స్‌తో పాటు వాహన పత్రాలను వెంట ఉంచుకోవాలని తెలిపారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేస్తారని హెచ్చరించారు. ఆటోవాలాలు పరిమిత సంఖ్యలో మాత్రమే ప్రయాణికులను ఎక్కించాలని చెప్పారు. తనిఖీల్లో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

340 మందికి ఉచిత వైద్య పరీక్షలు

నందిగామ: మైత్రి సేవా సమితి, శంకర్ కంటి ఆసుపత్రుల సంయుక్త ఆధ్వర్యాన పట్టణ శివారు అనాసాగరంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 340 మందికి కంటి పరీక్షలు చేశారు. వారిలో 180 మందికి ఆపరేషన్లు అవసరమని నిర్ధారించారు. కార్యక్రమంలో మైత్రి సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు గుండాల బాలాజి, పలువురు సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

14న కాళీమాతకు శాకంబరీదేవి అలంకారం

కృష్ణలంక(విజయవాడతూర్పు): బస్టాండ్ సమీపంలోని శ్రీ కాళీమాత అమ్మవారి దేవస్థానం(త్రిశక్తి పీఠం)లో ఈ నెల 14వ తేదీ శుక్రవారం కాళీమాత అమ్మవారిని శాకంబరీదేవిగా అలంకరిస్తున్నట్లు ఆలయ కమిటీ కార్యదర్శి కె.జగదీష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలంకారానికి అవసరమైన వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లను భక్తులు గురువారం ఉదయం 10 గంటల లోపు సమర్పించాలని కోరారు. సేకరించిన కూరగాయలతో అమ్మవారికి అలంకరిస్తామన్నారు. భక్తులు విరివిగా పాల్గొని అమ్మవారి దయకు పాత్రులు కాగలరని కోరారు.

శాస్త్రోక్తంగా అరుణ హోమం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కొత్తపేట గణపతిరావురోడ్డులో వేం చేసి ఉన్న శ్రీ పండరీసాయి మందిరంలో సాయినాథుని సన్నిధిలో ఆదివారం సూర్యునికి ప్రీతికరమైన అరుణ హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీ పండరీసాయి మందిరం 13వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మూడు రోజులు పాటు నిర్వహించిన పలు ప్రత్యేక కార్యక్రమాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఉదయం స్వామి వారికి కాకడహారతితో కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం నిత్యాభిషేకం, విఘ్నేశ్వరపూజ, మండపారాధనలు, అరుణ జపం, అరుణ హోమాన్ని వైభవంగా అర్చకులు చేశారు.

విద్యతో సమాజంలో ఉన్నతస్థాయి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సమాజంలో ఉన్నత స్థితి పొందాలంటే అది విద్యతోనే సాధ్యమని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. సత్యనారాయణపురంలోని సీతారామ కల్యాణ మండపంలో అమరావతి బ్రాహ్మణ సేవ సంఘం ఆధ్వర్యాన పేద బ్రాహ్మణ విద్యార్థులకు ఆదివారం నోట్ పుస్తకాల పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే విష్ణు ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. అమరావతి బ్రాహ్మణ సేవా సంఘం సేవలను ఎమ్మెల్యే అభినందించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రతి పేద వాడు ఉన్నత చదువులు చదవాలనే ఆకాంక్షతో అమ్మ ఒడి, నాడు-నేడు, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర సంక్షేమ పథకాలకు కోట్లాది రూపాయాలు కేటాయించినట్లు తెలిపారు. అనంతరం అమరావతి బ్రాహ్మణ సేవా సంఘం నిర్వాహకులకు ఎమ్మెల్యే రూ.5 వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ శర్వాణిమూర్తి, సంఘం ప్రధాన కార్యదర్శి దశరథ రమేష్, మాజీ మేయర్ జంధ్యాల శంకర్, డాక్టర్ కుంద శ్రీధర్, డాక్టర్ గురునాథ శర్మ, ఊటుకూరి పార్థసారథి, పోపూరి సుబ్బారావు, అనుముల రాంబాబు, సూర్యనారాయణ శాస్త్రి పాల్గొన్నారు.

వైద్యశిబిరాలను వినియోగం చేసుకోండి

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



నందిగామ ఎమ్మెల్యే జగన్‌మోహనరావును సత్కరిస్తున్న సేవా సమితి సభ్యులు

నందిగామ టౌన్: ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యాన మండలంలోని లింగాలపాడులో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. తొలుత గ్రామంలోని లక్ష్మీ పేరంటాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి ఉచిత వైద్యశిబిరాలను నిర్వహిస్తున్నారన్నారు. సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలు ఎనలేనివని కొనియాడారు. ప్రభుత్వం ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యమిస్తోందని చెప్పారు. గ్రామాల్లోనూ కార్పొరేట్ స్థాయి వైద్యమందించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. దీనిలో భాగంగా ఫ్యామిలీ డాక్టర్ విధానంతో పాటు విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే జగన్‌మోహనరావును సత్యసాయి సేవా సమితి సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొల్లినేని పద్మజ, ఎంపీటీసీ సభ్యుడు గర్మిడి నరసింహారావు, లక్ష్మీ పేరంటాలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ పారుపల్లి హరిబాబు, బొల్లినేని శ్రీనివాసరావు, సేవా సమితి సభ్యులు కొమరగిరి శ్యాంప్రసాద్, ఉప్పుటూరి వాసుదేవరావు, రాఘవరావు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో మానవ మనుగడ



మొక్కలు నాటుతున్న రోటరీ క్లబ్ అధ్యక్షుడు విజయభూషణ్‌కుమార్, సర్పంచ్ శాంతి

గన్నవరంరూరల్: మొక్కల పెంపకంతో మానవ మనుగడ ముడిపడి ఉందని రోటరీక్లబ్ అధ్యక్షుడు జాస్తి విజయభూషణ్‌కుమార్ అన్నారు. మండలంలోని గొల్లనపల్లి జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ఆదివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యాన మొక్కలు నాటారు. విజయభూషణ్ కుమార్ మాట్లాడుతూ భూ తాపం నియంత్రణకు, పర్యావరణ రక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. విద్యాలయాలు, ప్రజల ఆవాస ప్రాంతాలు మొక్కలతో నిండాలని ఆకాంక్షించారు. వన సంరక్షణలో విద్యార్థులను భాగస్వాములను చేయడానికి రోటరీ క్లబ్ కృషి చేసిందని చెప్పారు. మొక్కలు పెంచడానికి కృషి చేసే విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. సీనియర్ రొటేరియన్లు చింతపల్లి సీతారామయ్య, గన్నే వెంకట్రావు, సర్పంచ్ గణపవరపు శాంతి, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ గణపవరపు వెంకయ్య, పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు బొడ్డు ప్రసాద్, మాజీ రోటరీ క్లబ్ అధ్యక్షుడు చిమట రామారావు, గన్నవరం గ్రంథాలయం కమిటీ చైర్మన్ నర్రా సీతారామారావు మొక్కలు నాటారు. హెచ్ఎం కెఎస్ జగదీశ్వరరావు, టీఎస్ఆర్‌కే ప్రసాద్, హాస్టల్ వార్డెన్ డానియేల్, సీఆర్పీ కాండ్రు మోహనరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్య విషయంలో అప్రమత్తం



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ కోనా వీరబ్రహ్మం

మధురానగర్(విజయవాడసెంట్రల్): చికిత్స కన్నా నివారణ మేలని, ఆరోగ్య విషయాల్లో అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ ఆయుర్వేద, హోమియో వైద్య నిపుణులు డాక్టర్ ఏఈఎస్‌కే ప్రసాద్, డాక్టర్ కోనా వీరబ్రహ్మం సూచించారు. స్థానిక దుర్గాపురం విజయ్‌నర్సింగ్ స్కూల్లో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత ఆరోగ్య అవగాహన, వైద్యశిబిరంలో 260 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అన్ని రకాల దీర్ఘకాలిక వ్యాధులకు ఆయుర్వేదం, హోమియోపతిలో ఎటువంటి దుష్పరిణామాలు లేకుండా చికిత్స చేయవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య విషయాలపై అవగాహన పెంచుకోవడంతో పాటు ఉచిత వైద్యసేవలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యకర జీవనం సాగించాలని సూచించారు. వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్ మాట్లాడుతూ.. ప్రజల్లో ఆరోగ్య విషయాల్లో అవగాహన కల్పించటంతో పాటు ఉచితంగా ఆయుర్వేదం, హోమియోపతి, అల్లోపతి వైద్యనిపుణులచే వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఆదిత్య చంద్ర భొట్ల, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

అత్తింటి వేధింపులపై పలు కేసులు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో అత్తింటి వేధింపులపై ఆదివారం మూడు కేసులు నమోదయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వించిపేట కట్టా వారి వీధికి చెందిన చిట్టూరి యామినిని లోకేష్ కృష్ణప్రకాష్‌కు ఇచ్చి పెద్దలు వివాహం జరిపించారు. ఆస్ట్రేలియాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం అని చెప్పి కట్నంగా రూ.15 లక్షలు, బంగారం, ఇతర లాంఛనాలు తీసుకున్నారు. యామినిని మరిది అఖిల్, అత్త జయశ్రీ, మామ రంగారావులు వేధింపులకు గురి చేయడంతో బాధితురాలు పుట్టింటికి చేరింది. అత్తింటి వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

అత్త, భర్తపై..

చిట్టినగర్ సొరంగం రోడ్డులోని మీనా స్టూడియో ప్రాంతానికి చెందిన మువ్వల మీనాని గుంటూరు జిల్లా కారంపూడి కాసారం గ్రామానికి చెందిన సాంబశివారెడ్డికి ఇచ్చి 2017లో పెద్దలు వివాహం జరిపించారు. ఇద్దరు ఆడపిల్లలు సంతానం కలిగిన తర్వాత సాంబశివరావు మద్యం తాగుతూ భార్యను వేధింపులకు గురి చేయసాగాడు. ఎవరితో మాట్లాడినా వివాహేతర సంబంధాలు అంటకడుతూ శారీరకంగా హింసించసాగాడు. భర్త వేధింపులతో పాటు అత్త అనువాయమ్మ వేధింపులకు గురి చేయడంతో కొద్ది రోజుల కిందట మీనా పుట్టింటికి వచ్చేసింది. వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

భర్తపై ఫిర్యాదు

గర్భిణి అని కూడా చూడకుండా భార్యను వేధింపులకు గురి చేస్తున్న భర్తపై కొత్తపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాత రాజరాజేశ్వరిపేటకు చెందిన షేక్ గౌస్య సుల్తానాకు 2016లో ఒంగోలుకు చెందిన మలక్ హుస్సేన్‌తో వివాహం జరిగింది. వీరికి మనస్పర్థలు రావడంతో విడాకులు తీసుకున్నారు. 2021లో బంధువుల వివాహానికి హాజరైన గౌస్య సుల్తానాకు విజయవాడకు చెందిన నషీర్ బాషా పరిచయం అయ్యాడు. నషీర్ బాషాకు వివాహం కాగా భార్యతో గొడవలు కారణంగా వేరుగా ఉంటున్నానని చెప్పి గౌస్యకు దగ్గర అయ్యాడు. పెద్దల సమక్షంలో వివాహం కాగా వేరుగా కాపురం పెట్టారు. గౌస్య గర్భిణి కావడంతో నషీర్ భార్యను వేధింపులకు గురి చేయసాగాడు. గౌస్యతో వివాహం గురించి నషీర్ తల్లిదండ్రులకు చెప్పకుండా మోసం చేయడమే కాకుండా వేధింపులకు గురి చేయడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఏసుక్రీస్తు మార్గం అనుసరణీయం

గుణదల(విజయవాడతూర్పు): దేవునికి విధేయులుగా ఉండే భక్తులందరూ ఏసుక్రీస్తు మార్గాన్ని అనుసరించడం ద్వారా జీవితాల్లో దీవెనలు కలుగుతాయని గుణదల మేరీమాత పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజ్ అన్నారు. పుణ్యక్షేత్ర ప్రదానాలయంలో ఆదివారం ఉదయం సమిష్టి దివ్యబలి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. క్రీస్తు మార్గం అనుసరణీయమన్నారు. ఆయన శిలువ మరణం ద్వారానే మన పాపాలకు పరిహారం లభించిందని చెప్పారు. క్రీస్తు మార్గాన్ని అనుసరించడం ద్వారా భక్తుల జీవితాల్లో శాంతి సమాధానాలు వెల్లివిరుస్తాయని పేర్కొన్నారు. అనంతరం సమష్టి దివ్యబలి పూజ సమర్పించి భక్తులకు సత్ప్రసాదాన్ని అందజేశారు. ఆదివారం సెలవ దినం కావడంతో పెద్ద సంఖ్యలో యాత్రికులు పుణ్యక్షేత్రానికి చేరుకున్నారు. మరియమాతను దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తుల కోసం గురువులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.